# మమత!

★

= రచన: కుమారి తాఘ్యాళు పర్వతవర్ధని =



'మేడమ్! మీ కొరకు ఎవరో వచ్చారు'.

ప్యూను పిలుపు ఆమె చెవులకు వినబడిందో లేదో గాని తన భవిష్యత్తునంతా తీర్చి దిద్దుకున్న ఆ తెల్లని కాగితాలపై భగవంతుని కరుణా కటాక్షులులా విధి లిఖితంలా ఎఱ్ఱని గీతలు గీస్తుందామె కుడిచేయి.

'మేడమ్! మీ కొరకు ఏవరో వచ్చారు' తిరిగి చెప్పాడు ప్యూను.

ఊ?! 'ఒకసారి తలెత్తి చూసి పంపమన్నట్లుగా తల వూపి, తన పనిలో నిమఘ్నరాలయింది లెక్చరర్ జానకి.

'నమస్కారం !'

'నమస్కా...రం' అంటూ తలెత్తిన జానకి కనురెప్పలు ఒక్క క్షణం టప టప లాడాయి. ఏనాడో పోగొట్టుకున్న వస్తువు దొరికినట్లుగా తేజోవంతమైన వదనం అంతలోనే వివర్ణమయింది, కానీ ఎంతగానో నిగ్రహించుకుని 'కూర్చోండి' అంటూ తన ఎదురుగా కుర్చీ చూపించింది జానకి.

ఆ వచ్చిన వ్యక్తి కళ్ళజోడు తీస్తూ కూర్చున్నాడు. అతనిని చూస్తుంటే గొప్ప ధనవంతునిలా వున్నాడు. ఆ విగ్రహంలో గాంభీర్యం దర్పం వుట్టిపడుతున్నాయి. కానీ వదనంలో ఏదో తెలియని నీలి నీడలు క్రమ్ముకుని వున్నాయి.

'మీరు—' ఏదో విధంగా పలుకరించాలి గనుక కాగితాలు తిరగవేస్తూ ప్రశ్నించింది జానకి.

'అవును—నేనే—'

'భలేవారండీ' అంటూ చిన్నగా నవ్వి 'ఎవరన్నా కావాలా?' అంది పోడిగా.

'ఊ! నేను మీకు తెలుసు ననుకుంటాను?'

'మిమ్మల్నా? ఏన్నడూ చూడందే?' ఆశ్చర్యాన్ని ప్రదర్శించింది.

'గుర్తు చేసుకోండి ఉపయోగ ముంటుందేమో?— అర్థోక్తిగా ఆశగా అన్నాడతను.

'అనవసరం—' కొంచెం తీవ్రంగానే పలికిందామె కంఠం.

'అవసరం సుభద్రా!' అతని మాటల్లో నిశ్చింత కొట్టొచ్చినట్లు కన్పించింది.

'వాట్? ఎవరితో మీరు మాట్లాడుతున్నారో తెలుసుకోవటం ఉచితం.'

'నీతోనే సుభద్రా! చచ్చిన పామును ఇంకా చంపకు, కొంచెం శాంతంగా నా మాట విను.'.

'మీరు కొంచం మర్యాదగా మాట్లాడండి. మనుష్యులను పోలిన మనుష్యులు చాలామంది వుంటారు. మీరు వెతికే ఆ సుభద్రను నేను కాను.

'సరే పోనీ ఈ వ్యక్తిని నీకు తెలుసా?' అంటూ కోటు జేబులోనుండి ఒక ఫోటోతీసి జానకి ముందుంచాడు వ్యక్తి. జానకి కళ్ళు ఒక్కసారిగా తిరిగాయి. ఆ వ్యక్తిని ఎవరని చెప్తుంది? ఏమని చెప్తుంది? దుఃఖం ముంచుకురాగా 'రాజా' అంటూ కళ్ళు మూసుకుంది జానకి.

'హుఁ! నాకు తెలుసు సుభద్రా, నాకు తెలుసు. నా కళ్ళు ఎన్నటికీ మోసపోవు...' జయించినట్లుగా మాట్లాడా డతడు.

'మిష్టర్! జాగ్రత్తగా మాట్లాడండి. మీ కళ్ళు మోసపోవు, మీరూ మోసపోరు. ఒకరిని మోసపుచ్చే మీరెలా మోసపోతారు? ఇక బయటకు నడవండి. ఊఁ' అంటూ విసురుగా కుర్చీలోనుండి లేచింది.

'సుభద్రా!'

'మిష్టర్! నీకెన్నిసార్లు చెప్పాను నా పేరు అది కాదని. ఇంతకీ నీవు బ్లాక్ మెయిల్ చేయాలనుకున్న వ్యక్తిని నేను కాదు. దయచేసి బయటకు నడవండి.'

'సుభద్రా! ఇంకా నన్నెందుకిలా చిత్రవధ చేస్తావ్? నిజంగా నన్ను ఎరుగవా నీవు?'

'ఎరుగను...దయచేసి వెళ్లండి' అంటూ గట్టిగా కళ్ళు మూసుకుంది జానకి.

'ఎంతగా మారిపోయావ్ సుభద్రా. నీ హృదయం ఇంత పాషాణమయిం దనుకోలేదు. యింతకీ___' ఎవరో వస్తున్న చప్పుడయేసరికి ఇద్దరూ తేరుకున్నారు. లెక్చరర్ నారాయణరావుగారు రావటంతో సంభాషణ ఆగిపోయింది. భారంగా కదిలిపోతున్న అతన్ని చూస్తూ వుండిపోయింది జానకి.

'ఎవరు జానకీదేవీ ఆ వచ్చింది?'

'ఘన దగ్గరకు ఇంకా ఎవరు వస్తారులెండి? దయతో ఒక కంట తమ పిల్లల్ని చూస్తూ వుండమని చెప్పిపోవటానికి వచ్చాడు ఒక పెద్దమనిషి....'

'పాపం, తగిన సత్కారం పొంది వెళుతున్నట్లున్నాడు' అంటూ నవ్వాడు నారాయణరావు. జానకి కూడా అతనితో శృతి కలిపింది వెలితిగా.

× × ×

ఇంట్లో వున్నదనేగానీ జానకి మనసు మాత్రం అక్కడ లేదు. పరధ్యానంగా తిరుగుతూనే వుంది. మనసు ఎంత నిగ్రహించుకుందామన్నా తిరిగి తిరిగి అదే దృశ్యం కళ్ళకు కట్టినట్లు కనపడుతుంది. అసలు తనెలా వెళ్ళమని చెప్పగలిగింది? ఒకనాడు ఆ కళ్ళను చూచి కదలలేక పోయిందే? ఆ మధురమైన వాక్కులు వింటూ మైమరచి పోయిందే? అందమయిన ఆ వదనం చూస్తూ తన్మయం చెందిందే? ఈనాడు అంత కఠినంగా తనకు తెలియదని ఎలా చెప్పగలిగింది?

శేఖర్! నా బ్రతుకునిలా ఎందుకు నాశనం చేశావ్? కలకాలం ఆనందంగా కాపురం చేయవలసిన మన జీవితాల నెందుకిలా విడదీశావ్? నా హృదయం పాషాణమన్నావే? నన్ను ఏకాకినిచేసి వెళ్ళిపోయిన నాడు ఏమయింది నీ హృదయం? నన్ను చూచి కాక పోయినా మన దాంపత్యానికి ప్రతిరూపంగా వెలిసిన బిడ్డని చూచయినా కనికరం కలుగలేదా? శేఖర్! ఆనాడు అంత నిర్దయగా కాలదన్నినవాడికి ఈనాడు గుర్తుకు వచ్చామా? కులటవని బిరుదిచ్చిన ఈ లోకం నీవే నా భర్తవని చెప్తే నమ్ముతుందా?...దుఃఖం ముంచుకు రాగానే దోసిట్లో ముఖం దాచుకుంది___ జానకి.

ఒకవైపు ఆనందం మరో ప్రక్క ఆవేదనతో నలిగిపోతున్న గుండెల్ని చేత పట్టుకుని మేడమెట్లు ఎక్కబోయిన జానకి కారు శబ్దం విని ఆగిపోయింది. అప్రయత్నంగా కిటికీలోనుండి వీధిలోకి చూచిన జానకి కనుబొమలు ముడిపడ్డాయి.

'టాటా!'

'హీరియో'. పరవళ్ళు త్రొక్కుతున్న హృదయంతో ప్రతాప్‌ను సాగనంపి హాల్లో అడుగుపెట్టిన రాజ తల్లినిచూచి ఆగిపోయింది. తల్లిలోని ఆ గంభీరత్వం, కోపంతో ఎఱ్ఱబడిన ఆ కళ్ళు చూస్తూంటే

Estd: 1942 Phone: 4375 & 3406 Tele: "BEYARKAY"

RUPUTED HOUSE FOR ANYTHING IN HANDLOOM

MANOHAR SAREES MADE IN INDIA

**B. R. KRISHNAIER & SONS.**

**Handloom Cloth Manufacturers & Exporters.**

*Manufacturers of:*

MANOHAR AND RAVINDRANATH BRANDS, HANDLOOM FANCY BEDSHEETS, TOWELS, TURKEY TOWELS, NAPKINS, DOUBLE NAPKINS, HAND KERCHIEFS, SAREES, DOTHIES AND CANVAS ROLLS ETC.

**No. 16-A, MAHAL 1st STREET,**
**MADURAI-I. (S. I.)**

**AGENTS WANTED FOR UNREPRESENTED AREAS**

BRK TOWELS MDU

శరీరం జలదరించింది. ఒక్క క్షణం తల్లి ముఖంలోకి చూచి తల వంచుకుని తిన్నగా మేడమీదికి దారి తీసింది.

'రాజా!'

వెనుదిరగకుండానే ఆగిపోయింది రాజామణి.

'ఎక్కడినుండి వస్తున్నావ్?' జానకి కంఠం కోపంగా పలికింది.

'కాలేజీనుండేనమ్మా!'

'మరి మామయ్య ఎక్కడ?'

'తనకి పనుందని, నన్ను త్వరగా ఇంటికి వెళ్ళమని ఫోన్ చేశారమ్మా' భయం భయంగానే సమాధానం ఇచ్చింది రాజ.

'నీ వెంట వచ్చినతనెవరు?

..............

'నిన్నే అడగటం' గట్టిగా అడిగిన అమ్మకు—

'క్లాస్ మేటమ్మా' తల వంచుకునే సమాధానమిచ్చింది.

'రాజా! నీవయినా సన్మార్గంలో నడచి నీకాళ్ల మీద నీవు నిలబడగల వనుకున్నాను. పురుషులతో, అందులోనూ ధనవంతులతో స్నేహం పనికిరాదని ఎన్నోసార్లు చెప్పాను. ఇదే చివరిసారి. ఇంకెన్నడూ అతనితో నాకు కనిపించకూడదు. గుర్తు పెట్టుకో— హెచ్చరించింది జానకి.

'అమ్మా!'

'అవును. నీ అమ్మ బ్రతికేవుందని తలిస్తే జీవించే వుండాలని నీవనుకుంటే ఇంకెన్నడూ అలా చేయకు. నా మాట విను రాజా. ఈ ధనవంతుల్ని నమ్మకూడదమ్మా'.

నీవు పొరపడుతున్నావమ్మా...కళ్లలో నీళ్ళు తిరుగుతుండగా ఎలాగో చెప్పగలిగింది ఆ మాటలైనా.

'అంతవరకూ వచ్చిందీ?

అతను చాల మంచివాడు. ఇక కొద్ది రోజులలో నీతో మాట్లాడుతా నన్నారమ్మా—

'పూ! సరి అతనే రానీ, నేనే చెబుతాను అంటూ చరచరా మేడమీదకి వెళ్ళిపోతున్న తల్లి' నిర్విణ్ణురాలై చూస్తూ అలాగే వుండిపోయింది రాజా మణి తడవుతున్న నేత్రయుగళితో.

× × ×

'మామయ్యా!'

ఏదో కేస్‌నుగురించి ఆలోచిస్తున్న కృష్ణారావు తలెత్తిచూచి 'రాజా కూర్చో' అంటూ కుర్చీ చూపించారు ఆలోచనలలోనుండి తేరుకుంటూ.

'కనుక్కున్నావా మామయ్యా?' రహస్యంఅడిగినట్లుగా అడిగింది రాజా.

'ఏమిటి?' వింతగా చూస్తూ అడిగారు తెలియనట్లుగ.

'పో మామయ్యా' అంటూ బుంగమూతి పెట్టి 'రాత్రి...అమ్మ...' అనగలిగింది.

'ఓ. అదా? మరచేపోయానమ్మా, ఈ రోజు తప్పక కనుక్కుంటాను. ఇంతకీ ఎక్కడి కేమిటి ప్రయాణం?

'మరి—ఒక ఫ్రెండు యింటికి వస్తానని మాట ఇచ్చాను' అందుకని చిన్నగా గొణిగింది రాజ.

ఊ! వెళ్ళు, మరి పాపం ఎదురుచూస్తుంటారు నీకోసం అంటూ నవ్వారు కృష్ణారావు.

'మంచి మామయ్య. అన్నట్లు అమ్మతో ప్రాక్టికల్స్ వున్నాయి అని చెప్పాను. పొరపాటున నోరు జారేవు. మామయ్యా వస్తాను' అంటూ హుషారుగా వురుకెత్తింది రాజ.

పెంకిపిల్ల—అనుకుంటూ నిండుగానవ్వారు కృష్ణారావుగారు. ఇంతలోకి జానకి కాఫీ తీసుకువచ్చింది.

'ఏం టన్నయ్యా, నీలో నీవే నవ్వుకుంటున్నావు?' అంటూ కాఫీ టేబుల్ పైన వుంచి తనూ ఎదురుగ వున్న కుర్చీలో కూర్చుంది.

ఏం లేదు రాజాను చూచి. అద్సరే ఆరోగ్యం బాగోలేదా? అంటూ కాఫీ అందుకున్నారు.

..............

'హు! నేను నమ్మను సుభద్రా!'

'అన్నయ్యా!' ఆశ్చర్యంతో తలెత్తింది.

ఫరవాలేదు లేమ్మా, ఎవరూ లేరుగా. చూడు సుభద్రా, నీ మనసులో ఏదీ పెట్టుకోకు. నిన్ననే అడుగుదామని అనుకున్నాను కానీ నీ గదికి వస్తే నిద్రపోతున్నావు. పెద్దవారికి ఎన్నో సమస్యలొస్తుంటాయి. తీరిపోతుంటాయి. వాటి ప్రభావాన్ని మనసులో దాచుకొని సమర్థించుకోక పిల్లలమీద కోపతాపాలు చూపిస్తే వారు బాధపడతారు. తరువాత మనమే చింతించాల్సి వస్తుంది.

'అర్థమయిం దన్నయ్యా, ఇదంతా రాజా చెప్పిందా నీకు?'

'ఎవరు చెప్తేనేమ్మా! ఇంకెన్నడూ దాన్ని కోపగించుకోకు.'

'హు! అన్నయ్యా, నిన్ను ఎదిరిస్తున్నానని అపార్థం చేసుకోకు. నీ గారంవల్లనే అది అంత నిర్భయంగా ఇష్టానుసారం ప్రవర్తిస్తోంది. అన్నయ్యా, నా గుండెల్లో రగిలే చిచ్చు నీకు తెలియనిది కాదు. ఈ పురుషలోకంపై ద్వేషం కలుగుతూంది. ఇంకా నన్ను దురదృష్టం వెంటాడుతూనే వుందన్నయ్యా' అంటూ రెండు చేతులతో ముఖాన్ని కప్పుకుంది.

సుభద్రా! అసలు విషయం చెప్పకుండా ఏమిటిది? ఏం జరిగింది? ఆత్రుతగా అడిగిన కృష్ణారావు గారికి—

'ఇంకా ఏం జరగాలన్నయ్యా? ఆయన తిరిగి వచ్చారు...' ఇక మాటలు రాక వెక్కి వెక్కి ఏడ్వసాగింది.

ఆ మాటతో షాక్ తిన్నవానిలా కుర్చీలో నుండి లేచారు కృష్ణారావుగారు.

'ఎవరు, రాజా వచ్చాడా?' సంభ్రమాశ్చర్యాలతో ప్రశ్నించారు.

'అఁ ను.'

'ఎప్పుడు? ఎక్కడ? మనింటికి రాలేదే?' ప్రశ్నల వర్షం కురిపించారు.

'హు! ఇంకా ఏ ముఖం పెట్టుకుని వస్తారు? నన్ను సుభద్రా అని పిలిచారు—కానీ—కానీ వారిని నేను ఎరుగనన్నాను, నా పేరు సుభద్ర కాదన్నాను, వెళ్ళిపొమ్మన్నాను కానీ వారు నా మాట వినలేదు,

మా పెండ్లిఫోటో చూపించి గుర్తుపట్టమని అడిగారు కానీ నాకు తెలియదన్నాను. మర్యాదగా వెళ్ళనంటే మెడబట్టి బయటకు గెంటిస్తానన్నాను—అన్నా నన్నయ్యా, అన్నాను. ఈ నోటితోనే అన్నాను' అంటూ వెక్కి వెక్కి ఏడ్వటం ప్రారంభించింది.

'ఎంతపని చేశావమ్మా' అంటూ పిచ్చిగా అటూ ఇటూ తిరగసాగారు కృష్ణారావుగారు. మౌనంగా శోకించసాగింది సుభద్ర.

'చేతిలో దొరికిన పెన్నిధిని వదులుకొన్నావు సుభద్రా—'

'పెన్నిధి ? ఎవరు పెన్నిధి ? ఒకనాడు నా పెన్నిధనే భ్రమించి మోసపోయాను. నా అనుకొనే వారినంతా వదులుకొని వారే నా జీవనజ్యోతని నమ్మి అగాధంలోకి త్రోసి వేస్తున్నా నిర్భయంగా నిలిచాను. ఆనాడు నిర్లక్ష్యంగా నిర్దాక్షిణ్యంగా కాలదన్నిననాడు ఏమయింది ఈ ప్రేమా, ఈ ఆదరణ? చెప్పన్నయ్యా చెప్పు—పెన్నిదనే అనుకోమన్నావా ?

ఈనాడు నీ దయవలన నీ ఆదరాభిమానాలతో అభివృద్ధిలోకి వస్తున్న రాజాకి ఏం చెప్పాలి ? ఈ విషయం వింటే నన్నెంతగా అసహ్యించుకుంటుంది ? మరలా నా జీవితం నాశనం కావలసిందేగా —అంటూ దోసిట్లో ముఖం దాచుకొని కుప్పగా కూలిపోయింది సుభద్ర.

ఆమెను ఓదార్చే శక్తి అతనికి లేదు. అందుకనే జాలిగ, బాధగ ఆమెకేసి చూస్తూ వుండిపోయారు.

'అవును సుభద్రా! ప్రశాంతంగా గడచిపోతున్న నీ జీవితంలో నావలన కల్లోలం లేచింది—' అన్న మాటలు విని ఇద్దరూ గుమ్మంవైపు చూచి నిర్విణ్ణులయ్యారు.

"ఆశ్చర్యంగా వుందా?" అవును. ఏనాడో పోయాడనుకొన్న వాణ్ని ఈనాడు కలిశాను.

రాజా! అంటూ అంతవరకూ ప్రతిమలా నిల్చున్న కృష్ణారావు ఒక్కసారిగా ఆలింగనం చేసుకొన్నారు.

'రాజా! ఎన్నాళ్ళకు వచ్చావు ? ఏనాటికయినా నీవు తిరిగి వస్తావన్న విశ్వాసం నాకుంది. రా ! ఇలా కూర్చో' అంటూ తీసుకువచ్చి సోఫాలో కూర్చోబెట్టారు. మెల్లిగా అక్కడినుండి వెళ్ళిపోబోతున్న సుభద్రని ఆపారు.

'పరాయివాళ్ళెవరూ లేరు సుభద్రా, ఇప్పుడే వస్తాను వుండండి' అంటూ వెళ్ళిపోయారు కృష్ణారావుగారు.

ఇద్దరి హృదయాలు వేగంగా కొట్టుకుంటున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో అన్ని షాపులలోను దొరుకుతున్నది
గోపాల్ పళ్ళపొడి


ఏమి మాట్లాడాలో తెలియలేదు. ఆ గదిని భయంకర నిశ్శబ్దం ఆవరించింది. కానీ రాజశేఖర్ ఆ భయంకర వాతావరణాన్ని భరించలేకపోయాడు.

'గుర్తు పట్టగలిగావా సుభద్రా?'

సమాధానం చెప్పలేక పోయిందే గాని గుండె వేగంగా కొట్టుకోసాగింది,

'ఇంకా నా మీద కోపం పోలేదా ? — ఆశగా అడిగాడు.

'కోపమెందుకోయ్' అంటూ కాఫీ కప్పుతో ప్రవేశించారు కృష్ణారావుగారు.

నీవు గనుక మౌనం వహించావు గాని అదే ఇంకొకరయితే నిలువునా షూట్ చేసి వుందురు.

'ఎవర్ని ?'

'హు ! ఎవర్నా? గుట్టుగ తల్లిదండ్రుల చాటున వున్న కన్నెను ప్రేమించి మోసం చేసిన నీచుడ్ని. తననే నమ్ముకుని తనే సర్వస్వమని ఎంచి తనవారినంతా వదలి వచ్చిన వనితని వంచించిన వంచకుడ్ని. నా వలన గర్భవతియై పండంటి బిడ్డని ఎత్తుకొని నా రూపాన్ని చూచుకుని మురిసిపోతున్న కాంతని నట్టడివిలో వదలిపోయిన ద్రోహిని. ఏనాడో పోయి ఈనాడు సంఘంలో గౌరవంగా సాఫీగా జీవితాన్ని వెళ్ళదీస్తున్న వారిని నరకంలోకి తిరిగి ఈడ్చాలని ప్రయత్నిస్తున్న కృతఘ్నుణ్ని కృష్ణా! ఇప్పుడు అర్థమయిందా?'—సుభద్ర వెక్కిళ్ళు వినిపించటంతో ఒక్కసారిగ ఆగిపోయాడు రాజశేఖర్.

'సుభద్రా! ఏడుస్తున్నావా ?—ఏడవకు, ఇక నీ జీవితంలో ప్రవేశించను: ఆ తొందరపాటులో నేచేసిన అపరాధానికి ఫలితంగా నీకు దూరమై, ఏలా బ్రతికానో నీకు తెలియదు. శారద భర్త చనిపోయారని టెలిగ్రాం రావటంతో ఇక అక్కడే నిలువలేక పోయాను. ఆ తొందరలోనే నీవైపు చూచాను. నీవు హాయిగ పాపను ప్రక్కలో వేసుకొని నిద్ర పోతున్నావు. నిన్ను లేపాలన్న ఆలోచనే రాక అలాగే సూట్ కేస్ తో బయలు దేరాను. ఇంటికి చేరిన నాకు మతిపోయింది. అల్లుని మరణం చూచిన నాన్న కూడా పోయారు. ఆ దుఃఖసాగరంలో మునిగి నీ విషయం మరచాను. ఒకనాటి రాత్రి పాప కలలో రాగా అప్పుడే వుత్తరం వ్రాశాను కానీ రెండు దినాలకే నన్ను అపార్థం చేసుకొని ఎటో వెళ్ళిపోయావు, ఆ జాబు తిరిగి నన్నే చేరింది.—తిరిగి చెప్పసాగాడు,

'సుభద్రా ఆనాటినుండి ఈనాటి వరకు నిన్ను వెతకని ప్రదేశం లేదు. నిన్ను అనుకోని ఘడియ లేదు. ఆ విరహబాధ భరింపలేక పోయిన సంవత్సరమే తీర్థయాత్రలు సేవించి తిరిగి వచ్చిన పిమ్మట నీ జాడ తెలిసింది. నేరుగా ఇక్కడికి వస్తే కృష్ణ ఏమంటాడోనని నిన్ను కలుసుకున్నాను—కానీ—అదంతా ఎందుకు సుభద్రా! ఒక్కసారి పాపని చూపించు, కళ్ళారా చూచి వెళ్ళిపోతాను, శాశ్వతంగా వెళ్ళిపోతాను.

దుఃఖంతో గొంతు పెగల్లేదు సుభద్రకి. గోడకి తలాన్చి మౌనంగా రోధించసాగింది.

'కృష్ణా నీవయినా చెప్పు, పాపను చూచే అర్హత నాకు లేదా? నే చూచినంత మాత్రాన నా అపవిత్రత అలుముకుంటుందా? కృష్ణా, చెప్పు కృష్ణా.'

'రాజా! నీవు కూడా ఇలా అయితే ఎలా? సుభద్రా లోపలికి వెళ్ళు. అమ్మాయి వస్తే ఎక్కడికీ పంపకు. రాజా ఇలా రా' అంటూ వెళ్లిపోయాడు కృష్ణారావు. రాజశేఖర్ కూడా అతన్నే వెంబడించాడు.

× × ×

నిజంగా నేను అపార్థం చేసుకున్నానా? ఇదంతా నిజమేనా? వారు నీతిపరులేనా? నా జీవితం సర్వనాశనం కాదా? లేక ఇదో కట్టుకథా? ఇన్ని సంవత్సరాలు వారు నిజంగానే విరహబాధను అనుభవించారా? జీవితంలో కోరి ఎన్నుకొన్న భాగస్వామి, వంచకుడు, ద్రోహి కాదా? నా వూహే పొరపాటేమో?

ఏమైనా కానీ జరిగిందేదో జరిగింది. రాజాకి తండ్రిని వుంటే చూస్తుంది. లేదా నా జీవితం ఇలాగే గడుస్తుంది. రాజాకు మాత్రం ప్రేమవివాహం చేయకూడదని నిశ్చయించుకుని రాజాను పిలిచింది.

'ఏమ్మా పిలిచావు?'

'ఊఁ! కూర్చో' అంటూ కుర్చీ చూపించింది.

గంభీరముద్ర దాల్చిన తల్లికి ఎదురుగా కొంచెం భయంగానే కూర్చుంది.

ఆ కళ్ళు, ఆ నోరు రాజశేఖరాన్ని గుర్తుకుతెస్తున్నాయి. కాంతివంతమైన పసిమిఛాయలో యవ్వనపు సొంపుల్ని దిద్దుకొని ముగ్ధమోహనంగా కూర్చున్న కూతుర్ని తదేకంగా చూస్తూ కూర్చుంది సుభద్ర. తల్లి ఆవిధంగా నఖశిఖ పర్యంతం పరీక్షిస్తుంటే కూర్చోలేక పోయింది రాజా. లేచిపోతే ఏమంటుందోనన్న భయంతో ఇబ్బందిగా కదిలింది రాజా.

'మామయ్య లేరామ్మా ?' నిశ్శబ్దాన్ని భరించలేక ప్రశ్నించింది రాజా.